క్లుప్తంగా

శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో పూజలు



అమ్మవారికి హారతినిస్తున్న అర్చకుడు మల్లాచారి

కనగల్ : మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుక అమ్మవారికి సంకష్ట చతుర్థి వైశాఖమాసం సందర్భంగా శుక్రవారం అలంకరణ చేశారు. శుభ సాయంత్రం వేళ విశేషంగా కుంకుమ పూజలు చేసి అమ్మవారికి ఆలయ అర్చకులు సూర్య హారతినిచ్చారు. అనంతరం అర్చకుడు మాల్లా చారి మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శనం చేసుకున్న వారికి సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం అన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు



చిట్యాల బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేస్తున్న మరుగుదొడ్ల ట్యాంకులు

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల : పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో గత పదిరోజులుగా మరుగుదొడ్లు మూసి ఉండడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'మరుగుదొడ్లకు తాళం' అనే కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన ఆర్టీసీ అధికారులు మరుగుదొడ్ల వినియోగానికి అవసరమైన మరమ్మతులు చేపట్టారు. దీంతో త్వరలోనే మరుగుదొడ్లు వినియోగంలోకి రానున్నాయి. దీంతో సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షి దినపత్రికకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న భక్తులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని గోకుల్‌నగర్‌లో శుక్రవారం బ్లూమింగ్ బర్డ్స్ స్కూల్లో చండీ హోమం, గణపతి పూజ, నవగ్రహ పూజలు, సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి అరుంధతి, చిత్తడి ప్రభాకర్‌రెడ్డి, వేణుకుమార్‌రెడ్డి, వేణుగోపాలరావు, మారెడ్డి సందేశ్ రెడ్డి, జీఎం గౌడ్, అర్చకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తుల శ్రీనివాస్‌కు ఉత్తమ కథా పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

నకిరేకల్ : మండలంలోని తాటికల్ జెడ్పీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు, కవి, కథా రచయిత తుల శ్రీనివాస్‌కు ఉత్తమ కథా పురస్కారం లభించింది. తుల శ్రీనివాస్ రచించిన కొత్తల పండుగ అనే కథకు అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో జరిగిన కార్యక్రమంలో ప్రజాకవి గోరటి వెంకన్న చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. అవార్డు అందుకున్న తుల శ్రీనివాస్‌ను సాహితీ వేత్తలు మునాస్ వెంకట్, సాగర్ల సత్తయ్య, పెరుమాళ్ల ఆనంద్, పాడిచేటి శంకర్, సారంగి వెంకన్న, శీలం భద్రయ్య అభినందించారు.

బస్సు సర్వీసు ప్రారంభం



చిట్యాల బస్‌స్టేషన్‌లో మెట్రోడీలక్స్ బస్సు

చిట్యాల : దిల్‌సుఖ్‌నగర్ నుంచి చిట్యాల వరకు ఆర్టీసీ మెట్రోడీలక్స్ బస్సు సర్వీసులు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. గతంలో మెట్రోడీలక్స్ బస్సు సర్వీస్ చౌటుప్పల్ వరకు మాత్రమే ఉండేవి. ఆ సర్వీ సును చిట్యాల వరకు పొడింగించాలనే డిమాండ్‌తో చిట్యాల ప్రాంత ప్రజలు, వివిధ పార్టీల నాయకులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంను కలిసి పలుమార్లు వినతిపత్రాలు అందించారు. అందుకు స్పందించిన అధికారులు దిల్‌సుఖ్‌నగర్ నుంచి నాలుగు మెట్రోడీలక్స్ బస్సు సర్వీస్‌లు చిట్యాల వరకు నడపనున్నట్లు తెలిపారు.

నిలిచిన రోడ్డు పనులు

- ప్రధానమంత్రి సడక్ యోజన నుంచి రూ.5కోట్ల18లక్షలు మంజూరు
- పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో 6నెలల క్రితం రోడ్డు పనులు ప్రారంభం
- పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి బదలాయించడంతో 3నెలల క్రితం నిలిచిన పనులు
- ప్రారంభించాలని గ్రామస్తుల వేడుకోలు



మట్టి పరిచి వదిలేసిన కాశివారిగూడెం రోడ్డు

తిప్పర్తి : మండలంలోని కాశివారిగూడెం గ్రామానికి వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే బురదమయంగా మారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. కనీసం ఆపదలో ఉన్న వారి కోసం గ్రామానికి అంబులెన్స్ కూడా రాని పరిస్థితి నెలకొంది.

ఎట్టకేలకు మంజూరైన నిధులు..

సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో కాశివారిగూడెం గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ఎట్టకేలకు 2023లో ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా రూ.5కోట్ల 18లక్షలతో బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. చిన్నాయిగూడెం పీడబ్ల్యూ రోడ్డు నుంచి కాశివారిగూడెం మీదుగా వయా రాజుపేట, యర్రగడ్డలగూడం, గంగన్నపాలెం వరకు సుమారు 8కిలోమీటర్ల వరకు రోడ్డు పనులు చేపట్టాల్సి ఉంది. నిధులు మంజూరైన 6నెలల తరువాత పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు పనులు ప్రారంభించారు. బీటీరోడ్డు నిర్మాణంలో భాగంగా 12కల్వర్టులకు గాను 7కల్వర్టులను పూర్తి చేయడంతో పాటు, రోడ్డుకు మట్టి వర్క్ కూడా పూర్తి చేశారు.

మూడు నెలలుగా నిలిచిన పనులు..

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మట్టిపనులు పూర్తి చేశారు. కాని రోడ్డు పంచాయతీరాజ్ శాఖ నుంచి ఆర్‌అండ్‌బీ శాఖకు బదలాయించడంతో మూడు నెలలుగా పనులు మధ్యలోనే అర్థాంతరంగా నిలిచిపోయాయి. ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి ఉత్తర్వులు అందిన తరువాత మళ్లీ రీటెండరింగ్ చేపట్టి పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. దీంతో రోడ్డు పనులు ఆలస్యం కానుంది. త్వరగా పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు త్వరగా పూర్తిచేయాలి



గ్రామానికి బీటీరోడ్డు పనులు ప్రారంభించారు. దీంతో పనులు వేగంగా పూర్తి చేస్తారని ఎంతో ఆశపడ్డాము. కాని మళ్లీ పనులు మధ్యలోనే నిలిపివేశారు. వర్షాలు వస్తే ఇబ్బందికరంగా ఉంటుంది. అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరించాలి.

– ఎస్‌కే జానిపాషు, కాశివారిగూడెం, గ్రామస్తుడు

వర్షాలు వస్తే ఇబ్బందిపడుతున్నాం



రోడ్డు పనులు వేసవిలో పూర్తికాకుంటే ఇబ్బంది ఎదుర్కోవాల్సిందే. వర్షాలు పడితే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండదు. పనులు త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. రోడ్డు లేక ఇబ్బందులకు గురి కావాల్సివచ్చేది. ప్రభుత్వం స్పందించి పనులు ప్రారంభించాలి.

– ఎస్‌కే మౌలానా, కాశివారిగూడెం

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

కాశివారిగూడెం గ్రామానికి వెళ్లే రోడ్డును పంచాయతీరాజ్ నుంచి ఆర్‌అండ్‌బీకి బదలాయించడం జరిగింది. దీంతో అధిక నిధులతో పాటు రోడ్డు విస్తరణ జరుగుతుంది. ఆర్‌అండ్‌బీ నుంచి ప్రతిపాదనలు వచ్చిన వెంటనే మళ్లీ త్వరలోనే రోడ్డు పనులు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, పీఆర్, ఏఈ తిప్పర్తి

ఉగ్రదాడులను కేంద్ర ప్రభుత్వం అణిచివేయాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చిట్యాల: ఉగ్రవాదుల కుట్రలను కేంద్ర ప్రభుత్వం అణిచివేయాలని సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కోరారు. శుక్రవారం చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో నిర్వహించిన సీపీఐ మండల మహాసభలో ఆయన మాట్లాడారు. టెర్రరిజం పేరుతో భారతదేశాన్ని ఇబ్బందులకు గురి చేసే ఉగ్రవాద చర్యలను దేశ ప్రజలంతా ఖండించాలని పిలుపునిచ్చారు. దేశ సమగ్రత, భద్రత విషయాల్లో అమెరికా జోక్యం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వాలు కార్మికుల హక్కులను పట్టించుకోకుండా కార్పొరేట్ సంస్థలకు మద్దతుగా నిలుస్తున్నాయని విమర్శించారు. కార్మికుల హక్కుల సాధనకు జూలై 9న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలోని ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురుమిద్దె శ్రీనివాస్, గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులుగౌడ్, పార్టీ మండల కార్యదర్శి ఎండీ అక్బర్, జిల్లా యాదయ్య, ఎస్‌కె.షరీఫ్, సీమ అంజయ్య, కేతరాజు అంజయ్య, దేశగాని బాలరాజు, గుండాల సత్తయ్య, జిల్లా లక్ష్మయ్య, దేవేందర్, శేఖర్, బక్క శెట్టి, శివ, శేఖర్‌రెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

నల్లగొండ : చందంపేట మండలంలో పాఠశాల విధులకు హాజరు కాకుండా సంవత్సరం వేతనం ఇచ్చిన అధికారులపై చర్య తీసుకోవాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్క శ్రీనివాస్‌చారి, పెరుమాళ్ల వెంకటేశం శుక్రవారం డీఈఓకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చందంపేట మండలంలోని పోలేపల్లి కాంప్లెక్స్ పరిధిలో కుర్రతండాకు చెందిన ఓ ఉపాధ్యాయురాలు గత జూలై నుంచి పాఠశాల విధులకు హాజరు కాకుండా ప్రతి నెలా వేతనం పొందుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు విచారణకు ఆదేశాలు జారీ చేసి విధులకు హాజరుకాకపోయిన ఆ ఉపాధ్యాయురాలికి వేతనం చెల్లించిన కాంప్లెక్స్ హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించకపోతే సంఘం ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ వెంకయ్య

మునుగోడు : గ్రామాల్లోని వీధులను, డ్రెయినేజీలను ప్రతిరోజు శుభ్రం చేసి పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి కె.వెంకయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని జక్కలవారిగూడెంలో పంచాయతీ అధికారులు, కార్యదర్శులకు, మల్టీపర్పస్ వర్కర్లకు తడి, పొడి చెత్తసేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిరోజు ఉదయానే చెత్త ట్రాక్టర్ల ద్వారా తడి, పొడి చెత్తలను సేకరించి వాటిని వర్మికంపోస్టు షెడ్లకు పంపాలన్నారు. అక్కడికి తీసుకెళ్లిన చెత్తలోని ప్లాస్టిక్ కవర్లను వేరిచేసి వర్మికంపోస్టు ఎరువులు తయారు చేయాలని సూచించారు. అనంతరం సేకరించిన చెత్తతో వర్మికంపోస్టు ఎరువులు తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నల్లగొండ, దేవరకొండ, మిర్యాలగూడ డివిజన్ అధికారులు, మునుగోడు, చండూరు, గట్టుప్పల్ మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గేదెలు, దూడల అక్రమ రవాణా

చిట్యాల : పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో 65నంబర్ జాతీయ రహదారిపై డీసీఎం వాహనంలో అక్రమంగా గేదేలను, దూడలను రవాణా చేస్తుండగా శుక్రవారం పోలీసుల తనిఖీలో పట్టుకున్నారు. ఎస్ఐ అమీన్ నసీహా తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఇస్మాయిల్, సయ్యద్ గౌస్, సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం చీమలకంపాడు గ్రామానికి చెందిన బానోత్ భద్రు డీసీఎం వాహనంలో 35పశువులను (గేదెలు, దూడెలు) నార్కట్‌పల్లి వైపు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా చిట్యాలలోని రైల్వేస్టేషన్ ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీల్లో గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు పశువులతో వెళ్తున్న డీసీఎం వాహనం స్వాదీనం చేసుకుని, పశువులు రవాణా చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శిథిలావస్థలో పంచాయతీ రాజ్ అతిథిగృహం



శిథిలావస్థకు చేరిన పంచాయతీరాజ్ శాఖ అతిథిగృహం

మునుగోడు : పట్టణంలో 35ఏళ్ల క్రితం బస్టాండ్ ఎదురుగా నిర్మించిన పంచాయతీ రాజ్ అతిథిగృహం నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. ఆ భవనాన్ని నియోజకవర్గ పర్యటనకు వచ్చిన అధికారులు, ప్రజాప్రతినిధులు కాసేపు విశ్రాంతి తీసుకోవడంతో పాటు మధ్యాహ్న సమయంలో భోజనాలు చేసేందుకు నిర్మించారు. అప్పటి నుంచి భవనాన్ని 15ఏళ్ల పాటు వినియోగించారు. అనంతరం భవనం పాతపడి మరమ్మతులకు నోచుకోవడంతో 9ఏళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్సీ దివంగత పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి నిధుల నుంచి మరమ్మతులు చేయించారు. ఆ తరువాత అందులో కొంత భాగం ఆర్‌డబ్ల్యూఎస్ డివిజన్ కార్యాలయానికి వినియోగించగా మరికొంత అతిథుల కోసం ఉంచారు. అయితే అక్కడి ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాన్ని మరొక చోటకు మార్చడంతో భవనాన్ని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. దీంతో ఆ భవనం భూత్ బంగ్లాగా దర్శనమిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు శిథిలావస్థకు చేరుకున్న భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

శ్రీవేణి మృతి ఐద్వాకు తీరనిలోటు

చిట్యాల : పట్టణానికి చెందిన ఐద్వా నాయకురాలు కొంపెల్లి శ్రీవేణి(48) మృతి సంఘానికి తీరనిలోటని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ అన్నారు. శ్రీవేణి రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. శ్రీవేణి పట్టణంలో ఓప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. శుక్రవారం ఆమె మృతి పట్ల పలువురు ఐద్వా నాయకురాల్లు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం పలువరు మాట్లాడి ఆమె సంఘం ఆధ్వర్యంలో మహిళల కోసం చేసిన సేవలను కొనియాడారు.

డబుల్‌బెడ్‌రూం ఇళ్లను పూర్తిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లింగస్వామి

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్లను వెంటనే పూర్తి చేసి అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి కత్తుల లింగస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2018లో ప్రారంభించిన డబుల్‌బెడ్ రూం ఇళ్లను నేటి వరకు పూర్తి చేయకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర కాలం గడిచినా అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడంలో విఫలమైందన్నారు. సమావేశంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి కత్తుల యాదయ్య, నాయకులు జోగు లక్ష్మయ్య, రెడపాక యాదయ్య, కురాకుల అంజయ్య, పిన్నింటి నారాయణరెడ్డి, రత్నం యాదయ్య, మంచాల వెంకటేష్, జెట్ట లింగస్వామి, సర్గాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతులు చేయరూ..!



కొప్పోలులో నిరుపయోగంగా ఉన్న చేతిపంపు



కేతేపల్లి చీమలగడ్డ కాలనీలో..

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాలలో సీసీరోడ్లు నిర్మించారు. ఈ క్రమంలో వీధుల్లో, రహదారుల పక్కన చేతి పంపులు చాలా చోట్ల సీసీ మధ్యలో మునిగిపోయాయి. మరికొన్ని మరమ్మతులకు గురైనా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇంటింటికి నల్లాల ద్వారా నీటి సరఫరాలో ఏదైనా అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా నీరందించే చేతి పంపులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో కొన్ని తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయి. వేసవి ఎండల నేపథ్యంలో చేతి పంపులను బాగు చేస్తే ఉపయోగంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి మంత్రి పరామర్శ



నాగార్జున్‌రెడ్డి మృతదేహాన్ని పరిశీలిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

కనగల్ : మండలంలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన అబ్బిడి నాగార్జున్‌రెడ్డి గురువారం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. శుక్రవారం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురిలో ఆయన మృతదేహాన్ని మంత్రి పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి నాగార్జున్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు గోలి జగాల్‌రెడ్డి, గోలి నర్సిరెడ్డి, కోయగూర అంజిరెడ్డి, సుంకిరెడ్డి కృష్ణరెడ్డి, ఇదుకుల్ల రవీంధర్, కంచర్ల వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని యాదయ్యగౌడ్, ఎర్రమాద వెంకట్ రెడ్డి, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, సింగం మల్లేష్, వేమారెడ్డి తదితరులున్నారు.

ధాన్యం దిగుమతులపై మిల్లర్ల సమావేశం



సమావేశంలో పాల్గొన్న మిల్లర్లు

నల్లగొండ : పట్టణంలో శుక్రవారం మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధాన్యం దిగుమతిలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ఒక్కో మిల్లర్‌కు 200శాతం ధాన్యం ఇవ్వడంతో ధాన్యం నిల్వ చేసేందుకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్న దానిపై చర్చించారు. అదే విధంగా సీఎంఆర్ సరఫరా తదితర విషయాలపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంపా నాగేందర్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్నాటి నారాయణ, రేపాల భద్రాద్రిరాములు, చిట్టిపోలు యాదగిరి, తేరేటిపల్లి హనుమంతు, జూలకంటి ఇంద్రారెడ్డి, కండె రామకృష్ణ, వీరమల్ల శ్రీనివాస్, కన్మంతరెడ్డి కేశవరెడ్డి, కొత్త విశ్వనాథం, బాలకృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గంగాధర్‌రావు

నకిరేకల్ : క్రీడాకారులు రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణించాలని బీజీఆర్ ఫౌండేషన్ చైర్మన్ బచ్చుపల్లి గంగాధర్‌రావు కోరారు. మండలంలోని మంగళపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 28నుంచి 30వరకు జరిగే 47వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల హ్యాండ్‌బాల్ పోటీల నేపథ్యంలో పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పాఠశాలలో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపాలని సూచించారు. అనంతరం ఇటీవల తమిళనాడులో జరిగిన హ్యాండ్ బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు నుంచి పాల్గొన్న మంగళపల్లికి చెందిన విద్యార్థిని కొప్పుల శ్రీజను సన్మానించారు. కార్యక్రమంలో హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, హెచ్‌ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చైతన్య కుమార్, రాజేందర్‌రెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

కట్టంగూర్ : బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని శుక్రవారం మండలంలోని దుగినవెల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాం, మధ్యాహ్న భోజన పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పాలని ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులకు తెలిపారు. అదే విధంగా మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పబ్బతి వెంకటరమణ, ఉపాధ్యాయులు కరుణాదేవి, మురళయ్య, లతితాజ్యోతి, శ్రీనివాసరావు, వెంకట్‌రెడ్డి, సలీం, వెంకటకృష్ణ ఉన్నారు.

పింఛన్ ఇప్పించరూ!

- 60 ఏళ్లు నిండినా పింఛన్ వస్తలేదు..
- రేషన్‌కార్డు లేదని మరుగుజ్జు భారతి ఆవేదన



చందంపేట : పుట్టుకతోనే మరుగుజ్జు... 60ఏళ్లు దాటి వృద్ధాప్య జీవితం గడుపుతుంది. నల్లగొండ జిల్లా నేరెడుగొమ్ము మండంలోని కలకొండ తండాకు చెందిన మరుగుజ్జు రమావత్ భారతి.. మరుగుజ్జు కావడంతో ఎక్కడ పని దొరక్క.. సొంత ఇల్లు అంటూ లేక నానా ఇబ్బందులు పడుతుంది. తమ్ముడి వద్ద శేష జీవితం గడుపుతున్న ఆమె పింఛన్ మంజూరు చేయాలని ఎన్నోమార్లు దరఖాస్తు చేసుకున్న బుట్టదాఖలైందని వాపోతుంది. పింఛన్ అందించాలని అధికారులకు మొరపెట్టుకుంటే చూస్తాం.. చేస్తామంటూ దాటేస్తున్నారే కాని కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తుంది. రమావత్ హన్య, గోచి దంపతులకు ఆరుగురు సంతానం కాగా నలుగురు మహిళలు, ఇద్దరు మగ సంతానం అందులో ఒక సంతానమే ఈ భారతి. కనీసం రేషన్ కార్డు కూడా మంజూరు చేయడం లేదని, పింఛన్ ఇవ్వాలని అధికారులను వేడుకుంటుంది. ప్రస్తుతం కరువు పనికి పోతే వచ్చే డబ్బులతోనే జీవితం వెళ్లదీస్తున్నట్లు పేర్కొంది.

రైతులకు తప్పని ఎదురుచూపులు

- నెలలు గడిచినా నేటికీ ఏర్పాటు కాని విద్యుత్ ట్రాన్స్‌పార్మర్
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిర్మించిన దిమ్మె

శాలిగౌరారం: విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులపాలిట శాపంగా మారింది. వ్యవసాయం చేసుకునేందుకు తమ భూముల్లో బోర్లు వేసుకున్న రైతులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు కోసం డీడీలు తీసి దరఖాస్తులు చేసుకుని సంవత్సరం కావొస్తున్నా అధికారులు నేటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. వానాకాలం పంటసాగు ప్రారంభం కానుండడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తారో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దరఖాస్తు చేసుకుని 11 నెలలు

శాలిగౌరారం మండలంలోని జాలోనిగూడెం గ్రామానికి చెందిన షేక్ బాషా, షేక్ సైదులు, షేక్ వలిఅహ్మద్ అనే ముగ్గురు రైతులు వారి సొంత భూముల్లో 2024 మే నెలలో బోర్లు వేసుకున్నారు. అనంతరం విద్యుత్ సౌకర్యం కోసం మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ వికాస్‌బ్యాంక్‌లో 2024 జూన్ 15న ఒక్కొక్కరు రూ.5787 డీడీలు తీసి మండల కేంద్రంలోని విద్యుత్ కార్యాలయంలో అందజేశారు. దీంతో విద్యుత్ శాఖ అధికారులు 2024 సెప్టెంబర్ 9న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తోపాటు 11 కేవీ విద్యుత్‌లైన్, ఎల్‌టీ విద్యుత్ లైన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు కావాల్సిన సామగ్రి మంజూరు చేశారు. ఆ తర్వాత కట్టంగూరు మండల కేంద్రానికి చెందిన ఓ కాంట్రాక్టర్‌కు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బిగించే బాధ్యతలను విద్యుత్ శాఖ అప్పజెప్పింది. రైతులే సొంతంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె నిర్మించుకున్నారు. అయితే విద్యుత్ లైన్లు వేసిన అధికారులు, కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మాత్రం ఏర్పాటు చేయడంలేదు. విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. దీంతో రైతులు ఈ విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. వారు విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని రైతులకు చెప్పారు. అనంతరం మండల విద్యుత్ అధికారులు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు బదులు పాత విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. దానికి నిరాకరించిన రైతులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌నే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. నెలల తరబడి ఎదురు చూస్తున్నా నేటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కాలేదు. విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందులు పెడుతున్నారు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కోసం 11 నెలల క్రితం దరఖాస్తులు చేసుకున్నాం. నేటికీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ట్రాన్స్‌ఫార్మర్ కోసం విద్యుత్ కార్యాలయానికి వెళితే నానా ఇబ్బందులు పెడుతున్నారు. మాకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ మంజూరైందని నల్లగొండ విద్యుత్ కార్యాలయంలో చెప్పారు. మండల అధికారులు పాత ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామంటున్నారు.

– షేక్ బాషా, రైతు, జాలోనిగూడెం

ఇప్పటికే రెండు పంటలను కోల్పోయాం



జాలోనిగూడెం గ్రామంలో మాకున్న సొంత భూమిలో గత సంవత్సరం బోర్లు వేసుకున్నాం. ముగ్గురి బోర్లు సక్సెస్ కావడంతో విద్యుత్ కోసం డీడీలు తీసి దరఖాస్తులు చేసుకున్నాం. సంవత్సరం గడిచినా నేటికీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయలేదు. వానా కాలం పంటకైనా విద్యుత్ సౌకర్యం కలుగుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నాం.

– షేక్ సైదులు, రైతు, జాలోనిగూడెం